
# కన్ఫెషన్

ఒరియా మూలం: దేబాశీష్ పాణిగ్రాహి
అనువాదం : సిహెచ్. శ్రీనివాసమూర్తి

ఫాదర్,

నేను నా పాపం వెల్లడించి, ప్రాయశ్చిత్తం చేసుకోవాలనుకుంటున్నాను. కాని పాపానికి పరిహారంగా కాదు. పరిహారం చెల్లించాల్సినంత తప్పు నేను చెయ్యలేదు. బాధాకరమైన నా జీవయానంలో ఒక సందేహం నా మనసును దహిస్తూ వస్తోంది. ఒక మంచి ప్రావీణ్యం గల గాయనిగా, ప్రఖ్యాతి చెందగలిగుండి కూడా నేను యిలా ఒక సాధారణ జీవితం గడపవలసిన స్థితి ఎందుకు దాపురించింది?



ఈరోజు నా యవ్వనం నా నుండి దూరంగా పారిపోయింది. అరవైలకు చేరువైనాను. ఏవేవో శిఖరాల కెగబాకాలనే తపనా లేదు. అంతశక్తి లేదు. నా భవిష్యత్తు నేరుగా ఓ సరళరేఖలా నా ముందు నాకు స్పష్టంగా కనిపిస్తోంది. చివరగా మృత్యుదేవత తన సమయంకోసం ఎదురుచూస్తోంది. నేను నిజం చెప్తున్నాను ఫాదర్. నాకిప్పుడు చావంటే భయంలేదు. రాబోయే దాన్ని గురించి నేనేనాడూ జీవితాన్ని వంచించుకోలేదు. ఏనాడూ పొందలేని ఒక ఆశాకిరణాన్ని ఆలంబనగా చేసుకుని మనుగడ సాగించటం నా జీవితంలో ఓ భాగమయింది. కాని నేనీ రెండు సంఘర్షణల మధ్య ఎందుకు నలిగిపోయాను? నా జీవితం యాంత్రికంగా బండి చక్రాల్లా ఎందుకిలా గడిచింది?

దాన్నలా వొదిలేయ్ ఫాదర్. నేను కొద్దిగా సెంటిమెంటల్‌గానూ వేదాంతిలా మాట్లాడుతున్నాను. సెంటిమెంటల్‌గా తయారైతే తీరని కోరికల ఈ బరువును, నేనేనాడు గుండెనుండి దింపుకోలేను. నా గొంతు గద్గదమై, నోటినుండి మాటరాక, ఈ గుండెకోత జీవితాంతం భరించక తప్పదు. అది నాలోనే ఉండి నాతోనే అంతమౌతుంది.

ఈ అనవసరపు ఉపోద్ఘాతం నీకు విసుగనిపించవచ్చు. నా మానసిక స్థితి నూటికి నూరుపాళ్ళు బాగానే ఉంది. నేనిప్పుడు మీకు చెప్పేదంతా చాలాకాలం ఆలోచించిన తర్వాత, నా మనఃపూర్వకంగా చెప్తున్నాను. సంవత్సరాల తరబడి నా గుండె గుహలో అగ్నిపర్వతంలా తిష్టవేసుకున్న ఈ బరువును మీ ముందు, ఆ దేవుని ముందు దించుకోవాలనుకుంటున్నాను.

ఎక్కడినుంచి మొదలుపెట్టాలి? మొదటగా నా పరిచయంతో మొదలుపెడ్తాను. నా పేరు మేరీ సెబాస్టియన్. పుట్టుకరీత్యా కాథలిక్ మతావలంబిని. మతమంటే భక్తి కలిగినదానిని. నాకు ఊహ తెలిసినప్పటినుంచి ఏ ఒక్క ఆదివారం కూడా చర్చికి పోకుండా ఉండలేదు. ప్రార్థనలు చేయకుండా గడపలేదు. ఖుర్దారోడ్‌లోని రైల్వేకాలనీలోని ఒక ఆంగ్లో ఇండియన్ కుటుంబంలో జన్మించాను. నా తండ్రి పీటర్ సెబాస్టియన్. రైల్వే డ్రైవర్. వారంలో నాలుగు రోజులు డ్యూటీలో ఉంటాడు. మూడు రోజులు విశ్రాంతి. నా తల్లి గ్రేసి సెబాస్టియన్. రైల్వే కాలనీ ఇంగ్లీషు మీడియం స్కూల్ టీచర్. నాకొక తమ్ముడున్నాడు. పేరు హారీ. నాకంటే మూడేళ్ళు చిన్నవాడు. మాది దిగువ మధ్యతరగతి కుటుంబం.

నా తల్లిదండ్రులు డబ్బున్నవాళ్ళు కారు. కానీ యూరోపియన్లలా హైక్లాసు జీవితం గడపాలనే తత్వం. ప్రతి శుక్రవారం రైల్వే క్లబ్‌లో జరిగే పార్టీలకు తప్పనిసరిగా హాజరయ్యే వాళ్ళ కుటుంబంతో సహా దానికోసం వారం ముందునుంచే సన్నద్ధం అయ్యేవాళ్ళం. హంగులకోసం సాక్స్, దుస్తులు, టైలు, సూట్లు, సెంట్లు అన్నీ సమకూర్చుకునే వాళ్ళం. ఆ పార్టీలో మా నాన్న విపరీతంగా తాగేవాడు. అతన్ని కంట్రోల్ చేయడం చాలా కష్టమయ్యేది. మా అమ్మ భుజం ఆసరాతో కష్టంగా యిల్లు చేరటం పరిపాటయింది.

మేము ఆ పార్టీల్లో పాల్గొనడానికి ఎవరికీ ఎలాంటి అభ్యంతరాలు లేకపోయినా, అక్కడకు వచ్చే యూరోపియన్లు, లోకల్ దొరలకు మా రాక అంతగా రుచించేది కాదు. వాళ్ళ స్థాయికి తగిన వాళ్ళం కామనే భావనుండేది. మేమిటు ఇండియన్లము కాము. అటు యూరోపియన్లమూ కాము. అందుకే మమ్ములను కొంత జాలితో చూసేవాళ్ళు. వారి ప్రవర్తనలో తేడా కొట్టొచ్చినట్టు కనిపించేది. హారీ, నేను చాలా బాధపడేవాళ్ళం. ఆ పార్టీలకు రామని మొండికేసేవాళ్ళం. కాని మా మాట చెల్లేది కాదు. బలవంతంగా మమ్ములను లాక్కుపోయేవాళ్ళు. ఆ క్లబ్ కెళ్ళటం మాకొక స్టేటస్ సింబల్ లాంటిది. మేము అక్కడున్నంతసేపు మౌనంగా గడిపేవాళ్ళం. అందరూ డాన్స్ చేస్తుంటే నాన్న మాత్రం స్నేహితులతో రమ్ము తాగుతూ గడిపే




వాడు. అమ్మ తన తోటివారితో పనికిమాలిన మాటలు పనీబడా కల్పించుకుని మాట్లాడుతుండేది. ఏం చేయాలో పాలుబోక మేమిద్దరం అటూ ఇటూ తారట్లాడుతూ గడిపేవాళ్ళం. మేము వేసుకున్న చవుకరకందుస్తులతో, ధనవంతుల పిల్లలు వేసుకునే ఖరీదైన బట్టలు, నగలను పోల్చుకుంటూ గడిపేవాళ్ళం. ఎప్పుడీ పార్టీ పీడ విరగడవుతుందా, ఎప్పుడు ఇంటికి వెళ్ళిపోదామా అనే ధ్యాసతోనే అయిష్టంగానే గడిపేవాళ్ళం.

చిన్నతనం నుంచి నేను పాటలు బాగా పాడేదాన్ని. ఈ కళ నాకు అమ్మద్వారా సంక్రమించింది. క్లబ్బులో నాకంటే తక్కువ టాలెంటున్న కలిగిన వారి పిల్లలకు అవకాశాలు ఎక్కువ యిచ్చేవారు. నన్ను మాత్రం కోరస్‌లకు పరిమితం చేసేవారు. స్కూల్లో, చివరకు చర్చిలో కూడా యిదే పరిస్థితి ఎదురయింది. ఈ అనుభవాలన్నీ నాలో ఒక గట్టి నిర్ణయానికి నాంది పలికాయి. ఏదో ఒకనాడు, ఈ దేశం గర్వించదగిన గాయనిగా ఖ్యాతి పొందాలనే బలీయమైన తపనకు ప్రేరేపించాయి. పెరిగి పెద్దదాన్నయి, నా గానమాధుర్యంతో అన్ని రికార్డులు బద్దలుకొట్టే ఒక ఆల్బమ్‌ను విడుదల చేసినట్లు, ప్రఖ్యాతిచెందిన కళాకారుల బృందంతో కలిసి, దేశవిదేశాల్లో పలు ప్రదర్శనలిచ్చినట్లు కలలుకనేదాన్ని. ఇంగ్లాండు, అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా వగైరా దేశాల ప్రజలచేత నీరాజనాలందుకున్నట్లు ఊహించుకునేదాన్ని. నేనున్న ప్రస్తుత పరిస్థితుల్లో, అది హాస్యాస్పదమే కావచ్చు. అది అయేపని అనిపించకపోవచ్చు. కాని నా యువ హృదయం మాత్రం ఆ కలను సాకారం చేసుకోవాలని ఉవ్విళ్ళూరేది. అటు ధనమూ, ఇటు సాంఘిక స్థితి లేని కుటుంబంలో పుట్టడం వల్ల నా కోరిక నెరవేరదేమోననే అనుమానమున్నా, నా ఆశ మాత్రం చావలేదు. ఏదో ఒకనాడు నా కలను నిజం చేసుకోగలుగుతాననే నమ్మకంతోనే గడిపాను, ఆరోజుల్లో.

కానీ ఫాదర్, నేనీనాడు ఆ విషయాన్ని కనీసం చెప్పటానికి కూడా నోరు రాని స్థితి. ఇండియాకు స్వాతంత్ర్యం వచ్చినప్పుడు నాకు పదేళ్ళు. క్విట్ ఇండియా ఉద్యమానికి ముందు, ఇండియాలో వున్న యూరోపియన్లందరికి, భారతదేశపు స్వాతంత్ర్యం ఇంకా ఎంతో దూరంలో లేదని తెలిసిపోయింది. అది కేవలం కాలానికి సంబంధించిన విషయం. ఈ సత్యం ప్రతి ఇండియన్‌లో ఆశలను, కలలను, ఆనందాన్ని నింపింది కాని, ప్రభుత్వంలో, వివిధ వ్యాపార సంస్థల్లో పనిచేస్తున్న యూరోపియన్లలో మాత్రం అభద్రతా భావాన్ని నింపింది. అస్థిరతకు లోనైనారు.

మా ఆంగ్లో యిండియన్ల పరిస్థితి నాలుగు రోడ్ల కూడలి చందమైంది. తక్కిన యూరోపియన్లలా మాకు తెల్లతోలు లేదు. మేము కూడా విదేశాలకు పోయి సెటిలవడానికి డబ్బూ లేదు. మిగతా ఇండియన్లతో పోల్చుకుంటే, శారీరకంగా, మానసికంగా మా మధ్య మైళ్ళ దూరముంది. మేము ఎంతగా యూరోపియన్ సంస్కృతిని, ఆచార వ్యవహారా




లను వంటబట్టించుకున్నా, వారిలో భాగం కాలేకపోయాము. యిండియన్లతో పోల్చుకుని మేము వారికంటే ఉన్నతులమనే అహం ఉండేది. ఆ ఆధిక్యాన్ని నిలబెట్టుకోవటానికి అవసరమైన ధనంగాని, అధికారం గాని లేవు. ఏ యూరోపియన్ దేశంలో గానీ మాకు ఎలాంటి ఎమోషనల్ మూలాలు లేవు. బహుశా మేము భారత ఉపఖండపు వలస వారసత్వానికి పుట్టిన అవసరం లేని మనుషులం. కాని ఈ నగ్న సత్యాన్ని అర్థం చేసుకోవటానికీ, ఎదుర్కోవటానికి నిరాకరించాము.

తను చనిపోయేంత దాకా, నాన్న ఈ విషయాన్ని తన మనసులోకి రాకుండా, రమ్ము, సోడా, ఐస్‌ముక్కల మధ్య దాచుకున్నాడు. అతనికి నిజ ప్రపంచంతో సంబంధం దూరమైంది. పచ్చితాగుబోతైనాడు. చావే అతని సమస్యలకు చివరి సమాధానమైంది. విపరీతంగా తాగటం మూలాన లివర్ క్యాన్సర్ సోకింది. బాగా ముదిరిన దశ వరకు దాన్ని గమనించకపోవటంతో, అతనికీ భూమి మీద నూకలు మరికొన్ని రోజులే అని తేలిపోయింది. నేనూ, అమ్మా, హారీ ముగ్గురం చర్చికిపోయి, ఆయన జీవితం ఏ బాధాలేకుండా ప్రశాంతంగా ముగియాలని ప్రార్థనలు చేసే వాళ్ళం. బహుశా దేవుడు మా ప్రార్థనలను విన్నాడులా వుంది. ఒక చలికాలపు రాత్రి ఆయన నిద్రలోనే కన్ను మూశాడు. లోకల్ సమాధి స్థలంలో ఆయన శరీరాన్ని అన్ని లాంఛనాలతో పాతిపెట్టాము. వేలకొలది సమాధుల మధ్య మరో సమాధి వెలిసింది. మరో సిలువ లేచింది. ''పీటర్ సెబస్తియన్. జననం 1898 మరణం 1950'' అనే అక్షరాలతో.

అది ఈనాటికీ నా మనసులో చెక్కుచెదరకుండా నిల్చిన బాధాకరమైన జ్ఞాపకం. నా యవ్వనారంభ దశలో, అత్యంత దుఃఖం కలిగించిన అనుభవం. నాన్న పెన్షన్, అమ్మ జీతం యింటి ఖర్చులకు సరిపోయేది కాదు. కాని అభిజాత్యం, ఆత్మగౌరవం మమ్ములను ఎవరి సహాయాన్ని కోరనివ్వలేదు. ఆ పరిస్థితుల్లో నా పదమూడేళ్ళ ప్రాయంలో, నర్సరీ పిల్లలకు రైమ్స్ చెప్పక తప్పలేదు. 'జానీ, జానీ వాట్ పాపా' లాంటి రైమ్స్ పిల్లలకు చెప్తున్నప్పుడు నా మనసంతా వికలమై, కళ్ళు చెరువులయేవి. వాటిని బలవంతంగా తుడుచుకుంటూ రోజుకు వందసార్లు అదే పాటను పిల్లలకు చెప్పేదాన్ని.

నన్ను ఎవరైతే అమితంగా ప్రేమించాడో, ఏదో ఒకరోజు భారతదేశపు నైటింగేల్ కావాలని ఆకాంక్షించాడో, ఆ తండ్రి నా నిస్సహాయస్థితి చూడటానికి మిగలలేదు. కడుపుకోసం యాంత్రికంగా నర్సరీ రైమ్స్ వల్లించటం మొదలయినాక, అంతవరకు నేను కంటూ వస్తున్న కల కళావిహీనంగానూ అపనమ్మకంగానూ మిగిలిపోయింది. ఆయన చావు మా దుర్దినాలకు నాంది. నాన్న తన మానాన తను కాఫిన్లో ప్రశాంతంగా చల్లని నేలక్రింద, ఏ బాధా, బరువు, ఆశ, నిరాశలు లేకుండా హాయిగా శాశ్వతంగా నిద్రపోతున్నాడు. అప్పుడప్పుడు నైరాశ్యత ఆవరించినపుడు, ఆయన సమాధిని దర్శించి ఒక పుష్పగుచ్ఛాన్నుంచి కొంతసేపు మౌనంగా నిలబడేదాన్ని.

'డాడీ! గొప్ప గాయని కావాలని ఆశించిన నీ కూతురి జీవితంలో సాలీళ్ళు గూళ్ళు అల్లుకుంటున్నాయి. కాని ఎన్ని అవాంతరాలు వచ్చినా, నేను ముందుకు సాగుతాను. ఏదో ఒకరోజు భారతదేశం గర్వించే గాయనిగా ఎదుగుతాను. యింకెవ్వరూ నమ్మరని తెలుసు, నీవు తప్ప నామీద నీకు ఎనలేని నమ్మకముంది. ప్లీజ్, నన్ను ఆశీర్వదించు పాపా!'' అంటూ ఏడ్చేదాన్ని.

నా స్వగతాలు మా నాన్న విన్నాడో లేదో తెలియదు గాని, అటువంటి సందర్భాల్లో నా మనసంతా ఒకరకమైన ప్రశాంతత ఆవరించేది. నా సంకల్పబలం రెట్టింపయ్యేది. మా నాన్న నాకోసం సెకండ్ హ్యాండ్ పియానో కొన్నాడు. నేను చిన్నతనం నుండే మోజార్ట్, బీతోవన్ సింఫనీలు అమ్మ దగ్గర నేర్చుకున్నాను. అమ్మ ఎప్పుడూ అంటుండేది. ''సంగీతం పవిత్రమయినది. అందులో మార్మిక సౌందర్యం యిమిడి వుంది'' అని మాకు నూరిపోసేది.

ఎవరైనా పాప్ సింగర్ కావాలన్నా మోడరన్ గాయని కావాలన్నా, అటు క్లాసికల్ సంగీతాన్ని, యిటు పాశ్చాత్య సంగీతాన్ని మధించాల్సి వుంటుంది. సాంప్రదాయ సంగీతమనేది, మనలను భగవంతునికి దగ్గరగా తీసుకువెళ్తుంది. ప్రశాంతపరిచి, మనసుకు ఆహ్లాదాన్నందిస్తుంది. నేను వయసులో వున్నప్పుడు ఈ మాటలు వంటబట్టేది కాదు. కాని అమ్మ ప్రతిరోజు రాత్రి డిన్నర్ తర్వాత పియానో వాయించేది. పియానో మీద ఆమె వేళ్ళు ఆనించగానే ప్రాణం లేని పియానోకి జీవం వచ్చినట్లుగా అనిపించేది. వాయిస్తున్నంతసేపు ఆమె మొఖంలో మార్మికానందమేదో అనుభవిస్తున్నట్లుండేది. నేను భగవంతుణ్ణి ప్రత్యక్షంగా చూడలేదు. అమ్మ ముఖమే నాకు దైవసన్నిధిలా అనిపించేది. ఎవరైనా దేవుణ్ణి గురించి అడిగితే యిదే సమాధానమిచ్చేదాన్ని.

అమ్మ దగ్గర నేర్చుకున్న సంగీత విద్యను ప్రదర్శించే వీలు దొరికే అవకాశం లేదు. కాని మార్క్ రాబర్ట్‌సన్ నాకు ఆ అవకాశ ద్వారాలు తెరిచాడు. అతను కలకత్తా నివాసి.

అతని అంకుల్ కుర్దారోడ్ రైల్వే కాలనీ రైల్వే హైస్కూల్‌లో ఇంగ్లీషు మాస్టర్‌గా వచ్చి చేరాడు. అతను అమ్మకు కొలీగ్ అవటం మూలాన ఆయన పరిచయం ద్వారా రాబర్ట్‌సన్‌ను కలవటం జరిగింది. ఆ పరిచయం స్నేహంగా మారి చివరకు ప్రణయంగా పరిణమించింది. మార్క్ గిటార్ వాయించటంలో దిట్ట. ఆ సంవత్సరం రైల్వే క్లబ్ వార్షికోత్సవాల్లో అతను గిటార్ వాయించాడు. నేను పాటలు పాడాను. అది చాలామంది ప్రశంసలకు వీలు చిక్కింది. మా జంట ఈడూజోడూ బాగుందనీ, సంగీతపరంగా కూడా అతికిపోయామని మెంబర్లు రిమార్కులు చేశారు. మార్క్‌పట్ల నాకొక విచిత్రమైన ఆకర్షణ ఏర్పడింది. నా పాలిట కదొక బలహీనత కూడా. అప్పుడు నాకు ఎన్నేళ్ళు? పదిహేడు సంవత్సరాలు. స్కూల్ ఫైనల్లో ఉన్నాను. అతని వయసు యిరవై మూడో, నాలుగో ఉండేది. మార్క్ సాంగత్యం నా పరువంలో యింద్రధనుస్సులోని సప్తవర్ణాలను నింపింది. అతను నన్ను చాలా ప్రోత్సహించాడు. నాలో చక్కని టాలెంటుందని, సరైన రీతిలో ప్రయత్నిస్తే పేరుప్రఖ్యాతులు సంపాదించటం కష్టం కాదని వెన్నుతట్టాడు. అకాల మృత్యువుకు బలి అవుతుందనుకున్న నా సంగీతాత్మ, మార్క్ ప్రోత్సాహంతో తిరిగి వికసించటం మొదలుపెట్టింది.


మార్క్‌కు కలకత్తాలో ఓ పేరున్న సంగీతం గ్రూపుతో సంబంధాలున్నాయి. వాళ్ల సభ్యుల్లో అతనొకడు. వాళ్ళు వేడుకలలో నైట్ క్లబ్‌లలో, ఐదు నక్షత్రాల హోటళ్ళలో ప్రదర్శనలిచ్చేవాళ్ళు. అతని ప్రోత్సాహంతో నేను కలకత్తా పోయి వారితోపాటు పాటలు పాడటం ప్రారంభించాను. ఢిల్లీ, కలకత్తా, బొంబాయి లాంటి నగరాల్లో ప్రదర్శనలిచ్చాము. గాయనిగా నా భవిష్యత్తుకు పూలబాట లేర్పడనున్నాయనే నమ్మకం కుదిరింది. అందుకు మార్కే కారణం.


కొంత అనుభవం సంపాదించిన తర్వాత, మార్క్ నన్ను పేరొందిన మ్యూజిక్ కంపెనీకి తీసుకెళ్ళాడు, ఆడిషన్ పరీక్షకు. నెగ్గితే, నా సోలో ఆల్బమ్‌ను రికార్డ్ చేయాలని అతని కోరిక. అందుకోసం ముందే ఒప్పందం మీద సంతకం చేయాల్సి వుంటుంది. సంవత్సరాల శ్రమ తర్వాత నా కల ఫలించేరోజు ఎదురైన సమయంలోనే అమ్మకు గుండెపోటు వచ్చిందనే వార్త నా పాలిట ఊహించని అశనిపాతమైంది. నా కలల మీద కన్నీళ్ళు చల్లింది. నేనూ, మార్క్ కుర్దారోడ్‌లోని అమ్మ దగ్గరకు పరుగెత్తాము. గుండెపోటు మూలంగా ఆమె ఎడమభాగాన్ని పక్షవాతం పూర్తిగా ఆక్రమించింది. హారీ ఢిల్లీలో చదువుకొంటున్నాడు. అమ్మ నిస్సహాయంగా తన పడకకే అంకితమైపోయింది. పక్క గదిలోనున్న పియానోవైపు అసహాయంగా చూసేది. తిరిగి ఆమె సుతారమైన వేళ్ళు పియానో మీటల మీద యిక ఏనాడూ నర్తించలేవు. నా ఆశ బుగ్గిపాలయింది. చనిపోయిన నాన్న పి.ఎఫ్. గ్రాట్యుటీ డబ్బుతో కుర్దారోడ్‌లోనే రెండు గదుల యిల్లు కొనుక్కున్నాము. మాకున్న ఆస్తంతా ఆ యిల్లే. హారీ కాలేజీ ఫీజు కట్టాలి. అమ్మకొచ్చే కొద్దిపాటి డబ్బు దేనికీ సరిపోయేది కాదు. హారీ ఒక డిపార్ట్‌మెంట్ స్టోర్‌లో పార్ట్ టైమర్‌గా చేరి తన చదువును సాగించాడు.

ఇల్లు అమ్మి కలకత్తా వెళ్లిపొమ్మని అమ్మ నాకు నచ్చచెప్పటానికి శతవిధాలా ప్రయత్నించింది. నా కల నిజం చేసుకోవటానికి, అక్కడే వుండి మ్యూజిక్ కంపెనీలో మరోసారి ప్రయత్నించమని పోరింది. మార్క్ కూడా అమ్మకు వంతపాడాడు. కాని నాకిది సుతరామూ ఇష్టం లేదు. అమ్మని ఆ స్థితిలో ఉంచి నా స్వార్థంకోసం నిలువ నీడను కూడా లేకుండా చేయటం అమానుషమనిపించింది. నేను పుట్టిందీ, పెరిగిందీ, నాన్న పనిచేసిందీ అక్కడే. అక్కడున్న సమాధి స్థలంతో నాకు దగ్గర సంబంధముంది.

అసలు సమస్యేమిటంటే నా మీద నాకే నమ్మకం కుదరడం లేదు. తీరా యిల్లమ్మి కలకత్తా చేరిన తరువాత ఆ కంపెనీ వారి టెస్ట్‌లో నేను నెగ్గలేకపోతే? అమ్మ యిక ఉద్యోగానికి పనికిరాదని ఆమె జాగాలో నన్ను వేసుకుంటామన్నారు. హారీ చదువు యింకా పూర్తికాలేదు. సంగీత ప్రపంచంలో కేవలం పాదం మోపడం వరకే నేను చేయగలిగాను. ప్రయాణించాల్సిన దూరాలు, ఎక్కాల్సిన ఎత్తులు యింకా చాలా వున్నాయి. మార్గం అంత సుగమం కాదు. క్లబ్బుల్లో, హోటళ్లలో పాడగా వచ్చే డబ్బు, కలకత్తాలో యింటి అద్దెలకు, అమ్మ వైద్యానికీ సరిపోదు. నిజానికి అమ్మ చేసే ఉద్యోగం అంత గొప్పది కాకపోయినా, కనీస భద్రత యివ్వగలుగుతుంది. అందుకని యింతకంటే గత్యంతరం నాకు తోచలేదు. ఇవన్నీ ఆలోచించి, మథనపడి, చివరకు కుర్దారోడ్‌లోని ఆ యింటిలోనే, పక్షవాతంతో మంచానికతుక్కుపోయిన అమ్మతో ఉండిపోవాలని నిర్ణయించుకున్నాను.

నా నిర్ణయం మార్క్‌ను చాలా నిరుత్సాహపరిచింది. అతను నన్ను తన కాబోయే వధువుగా భావించాడు. నేను కూడా అలాగే అనుకున్నాను. మా మార్గంలో మేము స్థిరత్వం పొందాక యిద్దరం






పెళ్లి చేసుకోవాలనుకున్నాం. మా వైవాహిక జీవితాన్ని అందమైన రంగులతో అలంకరించాలనుకున్నాం. కాని రంగులు వేయకముందే జీవితమనే కాన్వాసు చిరిగిపోయి అనుకోని మలుపు తిరిగింది. మార్క్ ఇష్టపడితే, అతను కూడా యిక్కడే ఉండిపోవచ్చు. ఊర్లోనే వున్న చర్చిలో పెళ్ళి చేసుకుని, అమ్మతో సహా ముగ్గురం వుండిపోవచ్చు. కాని మార్క్ తన కలలకు తాను అంకితమైన వ్యక్తి. హెచ్.యం.వి. కంపెనీ వారు అతని గిటారు రాగాలను ఆల్బంలో పొందుపరచటానికి సమ్మతించారని తెలిసింది. ఒకవైపు నామీద ప్రేమ, మరోపక్క తన ముందున్న బంగారు భవిష్యత్తు. అతనీ రెండింటి మధ్య నలిగిపోయాడు. పైకి ఒప్పుకోవటానికి అతని మనస్సు ఒప్పుకోలేదు. అతని ఆకర్షణ క్రమక్రమంగా నా పట్ల తగ్గటం ప్రారంభించింది. మా ప్రేమ తీవ్రత ఇంత క్షణికమైనదా? మార్క్ గురించి నేను చెప్పలేను గాని, నేను మాత్రం అతన్ని గుండెనిండా నింపుకున్నాను.

అందుకనే ఓరోజు రాత్రి భోజనాలయిన తర్వాత, అతన్ని కలకత్తాకు తిరిగి వెళ్ళిపొమ్మని చెప్పాను. ఆ మరుసటి దినమే అతను పూరీ – హౌరా మెయిల్‌కు వెళ్ళిపోయాడు. నా జీవితంలో మార్క్ రాబర్ట్ సన్ చాప్టరు అంతటితో ఆఖరైంది. దాని తరువాత అతని చిరునామా కూడా మరిచిపోయాను. అతను కూడా ఏనాడూ నన్ను పలకరించటానికి ప్రయత్నించలేదు. అతని తర్వాత మరికొంతమంది నా గుండె తలుపులను తట్టాలని ప్రయత్నించారు కానీ నేనా అవకాశం ఇవ్వలేదు. కుమారిగానే మిగిలిపోయాను. మిస్ మేరీ సెబాస్టియన్‌గా.

పెద్దగా మార్పేమీ నోచుకోని నా జీవితం యాంత్రికమైంది. హారీ కాలేజీ చదువు పూర్తయిన తర్వాత, అమ్మ తరపు బంధువుల సహాయంతో ఆస్ట్రేలియా వెళ్ళిపోయాడు. అతను కంప్యూటర్ కంపెనీలో పనిచేస్తున్నట్లు తరువాత తెలిపాడు. పెళ్ళయిందని, యిద్దరమ్మాయిలని రాశాడు. కొన్ని సంవత్సరాలు ఆ పిల్లల ఫోటోలు చూసుకునే మురిసిపోయేదాన్ని. హారీ ఏనాడూ ఇండియావైపు కన్నెత్తి చూడలేదు.

అమ్మ ఆరోగ్యం క్రమంగా క్షీణించటం మొదలైంది. ఆమెది అంతులేని వ్యథ. నాన్న అనారోగ్యంగా వున్నప్పుడు, అమ్మ నేను హారీ ముగ్గురం ప్రతి ఆదివారం చర్చిలో ప్రార్థనలు చేసేవాళ్ళం. ఇప్పుడు నేనొక్కదాన్నే అమ్మకోసం ప్రార్థనలు చేసేదాన్ని. ఎలాంటి కష్టం లేకుండా ఆమె జీవితం వీలయినంత త్వరగా ముగిసిపోవాలని దేవుణ్ణి వేడుకునేదాన్ని. కాని మునుపటిలా ఈసారి దేవుడు కరుణించలేదు. మంచానికే అంటుకుని అలా నిస్సహాయంగా పడివుండటం ఆమెకు నరకప్రాయమైంది. చివరకామె ఒక వర్షాకాలం రాత్రి తుది శ్వాస విడిచి ఈ బాధలనుంచి శాశ్వతంగా విముక్తి పొందింది. హారీకి టెలిగ్రాం పంపించాను. అతను రాలేదు. సంతాపాన్ని తెలియజేస్తూ లెటరొచ్చింది. అమ్మను కూడా నాన్న సమాధి పక్కనే పూడ్చేశారు. మరో జీవి స్మశానం చేరింది. మరో సమాధి, సమాధి మీద మరో సిలువ. గ్రేసీ సెబాస్టియన్. జననం 1902 – మరణం 1975.

అమ్మ పోయిన తర్వాత నేను పూర్తిగా ఒంటరాదాన్నయ్యాను. స్కూల్లో చిన్నపిల్లలే నాకు మిత్రులు. వారితో చాలా సంవత్సరాలు యాంత్రికంగా కనుమరుగైనాయి. నా కళ్ళకు దళసరి కళ్ళద్దాలొచ్చాయి. వెంట్రుకలు తెల్లబడ్డాయి. కాళ్ళ నొప్పులు, కీళ్ల నొప్పులు మొదలైనాయి. మృత్యుదేవత అడుగుల సవ్వడి దూరంగా వినిపిస్తోంది. మార్క్ నుంచి విడిపోయిన తర్వాత, నా చిరకాల వాంఛ క్రమక్రమంగా అంతరించింది. బంగారు కల కాలంలో కలిసిపోయింది. కుటుంబ బాధ్యతలు నా కోరికలను చిదిమేశాయి. తిరిగి నేనేనాడూ తల పైకెత్తి ఆ సుదూర స్వప్నం తాలూకు ఛాయలను కూడా చూడ సాహసించలేకపోయాను. అప్పుడప్పుడూ అనిపించేది, నేను మార్క్‌తో కలిసి అతని యిష్టప్రకారం కలకత్తా పోయి వుంటే, బహుశా నా కోరిక నెరవేరేదేమో! మ్యూజిక్ వారితో ఆల్బం సఫలమై వుండేదేమో. కాని రోగిష్టి అమ్మ పట్లా, హారీ పట్లా నేను చూపిన శ్రద్ధ పొరపాటా? నా బలహీనతా? పక్షవాతం వచ్చిన తర్వాత అమ్మ జీవితం అర్థరహితమే. హారీ తన చదువు తాను చూసుకునేవాడేమో! నా ఆసరా లేకుండానే తమ జీవితాలను వాళ్ళు వెళ్ళదీసుకోగలిగుండేవారేమో!

ఈరోజు అమ్మా నాతో లేదు. తమ్ముడు హారీ లేడు. అమ్మ తన సమాధిలో నిశ్చింతగా నిద్రపోతోంది. హారీ హాయిగా ఆస్ట్రేలియాలో పెళ్ళాం పిల్లలతో సెటిలయినాడు. నా గురించి ఆలోచించే తీరిక కూడా లేదతనికి. నా అరవైల్లో నేను మాత్రం మిగిలాను. కుమారిగా, మిస్ మేరీ సెబాస్టియన్‌గా. ఈ ఇంటికి కాపలాగా, ఒక భూతంలా, చావుకెదురు చూస్తూ వొంటరిగా మిగిలిపోయాను. ఇప్పుడు కూడా నేను మా అమ్మానాన్నల సమాధుల మీద పుష్పగుచ్ఛాల నుంచుతూనే వున్నాను. నేను కూడా త్వరలో వారిని కలుస్తానని కన్నీటితో ప్రార్థిస్తూనే ఉంటాను.

ఈనాడు కూడా చర్చికి ప్రతి ఆదివారం వెళ్తాను. అందరితో కలిసి ప్రార్థనలు చేస్తుంటాను. కాని ఎందుకు, దేనికోసం చేస్తున్నానో తెలియదు. నాకిప్పుడే కోరికా మిగల్లేదు. జరిగిన దానికి బాధ కూడా లేదు. తన స్వార్థం తాను చూసుకుని, తన వారి తలపులను మదిలో మెదలకుండా బ్రతికేవారే బహుశా సుఖంగా వుంటారేమో. తనవారికోసం, వారి ఆప్యాయానందాలకోసం పరితపించేవాళ్ళు, నాలాగే తమ అస్తిత్వాన్నే కోల్పోతారేమో!

"ఫాదర్! ప్రస్తుతం నేనున్న దశలో సుఖదుఃఖాలనే పదాలకు అర్థమే లేదు. వీటన్నింటినుంచి నాకు కావల్సింది విముక్తి. బాధల నుంచి, బరువుల నుంచి, సంబంధ బాంధవ్యాల నుంచి శాశ్వతంగా విముక్తి కావాలి.

ఫాదర్! నా కన్‌ఫెషన్ మీకు చాలా మామూలుగా అనిపించొచ్చు. కొత్తదనం లేకపోవచ్చు. బహుశా దారి తప్పిన దానిలా అనిపించొచ్చు. అందుకని నేను మరోవిధంగా కన్‌ఫెస్ చేయదలచుకున్నాను.

"నేను, మేరీ సెబాస్టియన్, చాలాచాలా మామూలు మనిషిని. అలాంటి నాకు అసామాన్యమైన కోరికలు, ఆశయాలు వుండటానికి వీల్లేదు. సామాన్యురాలిగా పుట్టిన దానిని అందుకు తగ్గట్టు సామాన్యంగానే వుండి తీరాలి. నేను దేవుణ్ణి కోరేదేమిటంటే నా తోటివారినందరిని సామాన్యులుగానే ఉంచమని. ఎలాంటి టాలెంట్లని ప్రసాదించవద్దని ప్రార్థిస్తున్నాను. అందుకోలేని పరిస్థితుల్లో ఆ టాలెంట్లను అందుకోవటం మాకు సాధ్యం కాని పని. తను చేరుకోలేని దానికోసం అర్రులు చాచటం వల్ల యిలా దారుణమైన బాధను అనుభవించటం అమానుషం. అమిత బాధాకరం. ఈ బాధ పగవారికి కూడా కలగకూడదు. నాస్తికులు కూడా ఒక మాట అంటుంటారు.

"ఆత్మను కోలుకోలేని విధంగా గాయపరచటం కంటే చంపటం మేలు. ఆ గాయాలతో బతుకు నీడు స్తారేమోగాని అస్తిత్వమంటూ ఏమీ మిగలదు." ★